క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ శనివారం పరిశీలించారు. శుక్రవారం పీహెచ్‌సీలో షార్ట్ సర్క్యూట్ జరిగి వాక్సిన్ నిల్వ ఉంచే గదిలో ఫ్రిడ్జ్‌లు, వాక్సిన్లు కాలిపోయిన సంఘటనపై స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ. 25 లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆయన వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె. శ్రీనివాస్, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మండల వైద్యాధికారి సింధూజ ఉన్నారు.

శ్రీగండి వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు


ప్రతిష్ఠాపనోత్సవాల్లో పూజా కార్యక్రమాలు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో శ్రీగండి వెంకటేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణంలో ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లిలో శ్రీరేణుకా ఎల్లమ్మ దేవి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీర్‌పూర్ ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోషాచార్యులు, అర్చకులు వొద్దిపర్తి మధుకుమార్ చార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న టీచర్లు

జగిత్యాల: ఆరోగ్యం చురుగా ఉన్నప్పుడే విద్యలో రాణిస్తారని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ కొమురయ్య అన్నారు. శనివారం పీఎంశ్రీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోషల్ వెల్‌బీయింగ్, మెంటల్ వెల్‌బీయింగ్ అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, చెడు అలవాట్లు కావొద్దని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామానుజం పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ మండప నిర్మాణానికి విరాళం

రాయికల్: మండలంలోని రామాజీపేట సీతారామాలయంలోని సీతారామ కల్యాణ మండప నిర్మాణానికి శనివారం దుబాయ్‌లోని వారధి చేయూత సంఘం ఆధ్వర్యంలో రూ.45,500 విరాళం ఆలయ కమిటి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోల రాజు, వారధి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: పదేళ్ల క్రితం అనుమతి లేకుండా నిర్మించిన మూడంతస్తుల భవనానికి కొత్తగా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చారని, వారిపై చర్యలు తీసుకోవాలని భగవాన్ రాజ్ అనే వ్యక్తి కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కొందరు అధికారులు మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని, పదేళ్ల క్రితం అనుమతి లేకుండా భవనం నిర్మించారని, అందులో కొంత ప్రభుత్వ భూమి కూడా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అనుమతి లేకుండా నిర్మించిన వ్యక్తులతోపాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రజోత్సవ సభపై సమావేశం

సారంగాపూర్: ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజోత్సవ సభకు బీర్‌పూర్ మండలం నుంచి జన సమీకరణపై బీఆర్‌ఎస్ నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కొల్మూల రమణ, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు నేరెళ్ల సుమన్‌గౌడ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్


రోడ్లను శుభ్రం చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, నాయకులు

వెల్గటూర్: రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలపడంతో పాటు రాజ్యాంగ పలాలు ప్రతీ ఒక్కరికీ అందరికీ అందించాలనే రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్‌లో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు రెండు రోజుల పాటు సర్వోదయ సంకల్ప శిక్షణ శిబిరం నిర్వహించినట్లు ప్రభుత్వ విప్ తెలిపారు. వెల్గటూర్ హరిత హోటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ముంగింపు కార్యక్రమంలో లక్ష్మణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం స్తంభంపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాజీవ్ గాంధీ పంచాయితీరాజ్ సంఘటన్‌లో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో నాయకులతో కలిసి పాల్గొని రోడ్లను శుభ్రపరిచారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గోపిక, నాయకులు పాల్గొన్నారు.

అర్బన్ హౌసింగ్ కాలనీ మున్సిపల్‌లో విలీనం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్


క్షీరాభిషేకం చేస్తున్న అర్బన్ హౌసింగ్ కాలనీవాసులు

జగిత్యాల: అర్బన్ హౌసింగ్ కాలనీని మున్సిపల్‌లో విలీనం చేసినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం మోతె కార్యాలయంలో మాట్లాడారు. నూకపల్లి, నర్సింగాపూర్ గ్రామ శివారులో 171, 183, 192, 193, 194, 198, 421, 428, 237 సర్వేనంబర్లలో గతంలో అర్బన్ హౌసింగ్ కాలనీగా ఏర్పాటు చేశామని, అందులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నూకపల్లి మున్సిపల్‌లో కలవడం కోసం కేబినేట్ ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపించగా అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిధుల లేమితో ఆలస్యం జరిగిందని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మౌలిక వసతులకు రూ.32 కోట్లు, నీటి వసతికి రూ.18 కోట్లు మంజూరు చేయగా పనులు సైతం పూర్తవుతున్నాయన్నారు. అమృత్ స్కీంలో లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణానికి నిధులు వస్తాయని, జగిత్యాల పట్టణ పరిసర ప్రాంతాలు మున్సిపల్‌లో కలవడం వల్ల అమృత్ స్కీంలోకి జగిత్యాల వస్తుందన్నారు. జగిత్యాల–తిప్పన్నపేట రహదారిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా రూ.17 కోట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి, నాయకులు గోలి శ్రీనివాస్, క్యాదాసు నాగయ్య, బాల ముకుందం, పంబాల రాము పాల్గొన్నారు.

సంజయ్, జీవన్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని నూకపల్లి అర్బన్ కాలనీని మున్సిపల్‌లో కలిపినందున ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో మిగిలిపోయిన మౌలిక వసతులను కల్పించాలని కోరారు. దీనిని మున్సిపల్‌లో కలపడం ఎంతో అభినందనీయమన్నారు.

ఆరోగ్యమైన జీవనశైలికి పోషకాహారం ముఖ్యం


బండలింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

మెట్‌పల్లిరూరల్/రాయికల్/మల్లాపూర్/పెగడపల్లి/మల్యాల: పోషణ పక్షోత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు ఆరోగ్యసూత్రాలతో పాటు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం వేడుకలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

హిందువులకు రక్షణ కల్పించాలి


మల్లాపూర్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: హిందువులకు రక్షణ కల్పించడంలో విఫలమైన బెంగాల్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోయిన పద్మాకర్ డిమాండ్ చేశారు. బెంగాల్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం విశ్వహిందూ పరిషత్ నాయకులు జగిత్యాల కలెక్టరేట్లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిట్ల గంగాధర్, మామిడాల రాములు, గాజోజు సంతోష్, జిట్టవేణి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు అమానుషం

మల్లాపూర్: బెంగాల్ రాష్ట్రంలోని హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమని విశ్వహిందూ పరిషత్ పరిషత్ మండల అధ్యక్షుడు కైర నాగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం వీహెచ్‌పీ, బజరంగదళ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగాల్‌లో హిందువుల దాడులు చేస్తున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలనను విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు ముద్దం సత్యనారాయణగౌడ్, కాసారపు భూమారెడ్డి, మణికంఠ, మధుకుమార్, ఈశ్వర్, కార్తీక్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని హిందువుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోహార్ తుక్కారాం, మర్రి భాస్కర్, అరిగెల సత్యనారాయణ, తదితరులున్నారు.

పాఠశాలలు మూసివేతకు దారితీయకూడదు

జగిత్యాల: విద్యారంగ సంస్కరణల పేరుతో ప్రభుత్వ పాఠశాలలు మూసివేసే విధానాన్ని దారితీస్తోందని, దీనిని ఖండిస్తున్నామని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లింగారెడ్డి అన్నారు. జగిత్యాలలో శనివారం డీటీఎఫ్ కార్యాలయంలో జగిత్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి, ఇంద్రాల రామేశ్వర్, పద్మ, ప్రధాన కార్యదర్శిగా నరేందర్, కార్యదర్శులుగా గంగరాజం, సంపత్, రాజేందర్, సంతోష్, రాష్ట్ర కౌన్సిలర్‌గా రజాక్, లతదేవి, నాందేవ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రవీందర్‌రెడ్డి, ముజాబిర్, హరికృష్ణ ఎన్నికయ్యారు.

అడవిపంది మాంసం విక్రేత అరెస్ట్

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్‌కు దండుగుల నర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో భూమేశ్ తెలిపారు. అడవిపంది మాంసం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా.. నర్సయ్య విక్రయిస్తు కనిపించడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెక్కు అందజేత

కోరుట్లరూరల్: మండలంలోని సర్పరాజ్‌పూర్ గ్రామానికి చెందిన కొక్కు నడిపి గంగారాం కొంత కాలం క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన రూ. 5 లక్షల ప్రమాద బీమా చెక్కును శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్,నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల కొలతలు

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందించే దుస్తులను అందించేందుకు శనివారం జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కొలతలు తీసుకుంటున్నట్లు ఐకేపీ ఏపీఎం గంగాధర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థినీ, విద్యార్థులకు సరైన కొలతలు తీసుకుని వాటిని మహిళా సంఘాల ద్వారా దుస్తులు కుట్టించి సకాలంలో అందిస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు రవీందర్, మరియ, విద్యాసాగర్, గంగారాం, శ్రీనివాస్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

మల్లాపూర్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాతదాం రాజుపల్లిలో శనివారం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కరపత్రాల ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే ఉద్దేశ్యంతో ఉపాధ్యాయులు బడిబాట కరపత్రాలను రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులను దూరప్రాంతాల్లోని ప్రైవేటు విద్యాసంస్థలకు పంపించకుండా మన ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైదాసు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమేష్, వీడీసీ చైర్మన్ గజ్జి రాజరెడ్డి, హెచ్‌ఎం వేణు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వనిత, నాయకులుపాల్గొన్నారు.

మల్యాల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి జయసింహారావు అన్నారు. మల్యాల మండలం తక్కళ్లపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా బడిబాట కరపత్రాలను ఎంఈవో జయసింహారావు ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎల్.శంకర్, ఎండీ.కరీం, విఠల్, శివకుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు

జగిత్యాలరూరల్: సెలవుల్లో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు ఉంటాయని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం పొలాస జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు మహ్మద్ సలీమోద్దీన్ పదవీ విరమణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, మాజీ సర్పంచ్ నందయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాలజోన్: జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ శ్రీ చైతన్య స్కూల్‌లో జరుగుతాయని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, వెంకటేశ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను మే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ నెల 21న జిల్లా కేంద్రంలో జరిగే క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు బీర్‌పూర్ ఎంఈవో సిరుప నాగభూషణం తెలిపారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కథలాపూర్: కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి జనరల్ నాలెడ్జి పోటీలు నిర్వహించారు.ప్రతిభ చాటి గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 21న జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల మండలస్థాయి క్విజ్ పోటీల్లో జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి పల్లికొండ వర్షిత్ ప్రథమస్థానం సాధించగా ఎంఈవో గాయత్రి వర్షిత్‌కు బహుమతి అందించి అభినందించారు.

ధర్మపురి: సమగ్ర శిక్ష, రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌లో భాగంగా శనివారం విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రాయికల్: మండల విద్యావనరుల కేంద్రం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్, పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

వెల్గటూర్ : ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన జైనపురం నాగరాజు, చొప్పరి అరవింద్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మార్చ్ 2న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ బాలుర సెలక్షన్ ట్రయల్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి కరీంనగర్ జిల్లా నుండి జాతీయస్థాయికి ఎంపికై నట్లు కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వడ్లూరి రాజేందర్, జిట్టబోయిన శ్రీను తెలిపారు. ఈ నెల 20 నుండి 24 వరకు యూపీ లోని అక్బర్‌పూర్ 47వ జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు.

పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కల్వకోట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.11,100 నగదు, ఏడు మొబైల్స్ సీజ్ చేశారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలి బలవన్మరణం

వెల్గటూర్ : ఉరేసుకొని వృద్ధురాలు బలవన్మరణం చెందిన ఘటన వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పాకాల దేవమ్మ (58) గత 15 ఏళ్లుగా ఆస్తమాతో బాధపడుతోంది. శనివారం కుటుంబసభ్యులు పనికి వెళ్లిన తర్వాత ఇంట్లోనే ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి కుమారుడు పాకాల తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

మల్యాల: వివాహిత అదృశ్యమైన సంఘటన మల్యాలలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉప్పరి లక్ష్మి చిన్న కుమారుడు శ్రీధర్‌తో 12 ఏళ్ల క్రితం రజితతో వివాహమైంది. రజిత భర్త ఉపాధి కోసం ఏడాదిక్రితం దుబాయ్ వెళ్లాడు. శనివారం రజిత ఇంటికి తాళం వేసి ఉండడంతో కుటుంబ సభ్యులు, పరిసరాల్లోని బంధువుల ఇళ్లలో వెతికినా, ఆచూకీ లభించలేదు. అత్త ఉప్పరి లక్ష్మి, పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



జగిత్యాలటౌన్: చేపల మార్కెట్‌లో వాహనాల పార్కింగ్‌తో ఇబ్బంది పడుతున్న వైనంపై శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ఫొటో స్టోరీకి బల్దియా కమిషనర్ స్పందన స్పందించారు. చేపల మార్కెట్ నుంచి వాహనాలు తొలగించాల్సిందిగా తమ సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో శనివారం ఉదయమే చేపల మార్కెట్‌కు చేరుకున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతి పార్కింగ్ చేసిన వాహనాలను తొలగింపజేశారు. సమస్యపై స్పందించిన బల్దియా సిబ్బందితో పాటు వార్త ప్రచురించిన సాక్షి దినపత్రికకు కొనుగోలుదారులు, పట్టణ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నర్సింగరావు

మెట్‌పల్లిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు.మెట్‌పల్లి మండలం వెల్లుల,చౌలమద్ది,వేంపేట గ్రామాల్లో మెట్‌పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం మండలంలోని సత్తక్కపల్లి ఓ పత్రిక రిపోర్టర్ స్వామిగౌడ్ తల్లి చనిపోగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లింగం, నాయకులు లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి

కోరుట్లటౌన్: వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని సి. ప్రభాకర్ స్మారక భవన్ ఆవరణలో వృద్ధుల సంక్షేమ సంఘం , ప్రసాద్ డయాగ్నోస్టిక్స్ సంయుక్త నిర్వహణలో 60 ఏళ్లు నిండిన వృద్ధులకు రక్త గ్రూప్ పరీక్షల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెన్న విశ్వనాథం, రాచకొండ పెద్ద దేవయ్య, వనమాల ప్రసాద్, రాస భూమయ్య పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన


మామిడి కాయలు పరిశీలిస్తున్న కృష్ణారావు, ఏవో

మెట్‌పల్లిరూరల్: ఈదురుగాలులు,భారీ వర్షానికి మెట్‌పల్లి పట్టణంతో పాటు మండలంలో 2254 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మెట్‌పల్లి మండల వ్యవసాయాధికారి దీపిక తెలిపారు.శుక్రవారం కురిసిన వర్షానికి నేలకొరిగిన వరి,సజ్జ,నువ్వు పంటలను శనివారం ఆమె పరిశీలించారు.

కోరుట్ల రూరల్: మండలంలోనిపలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు నష్ట పోయిన పంటలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఏఈవోలు శనివారం పరిశీలించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు, వడగండ్ల వర్షం పడగా పడటంతో 6,862 ఎకరాల్లో పంటలు నష్టం జరిగినట్లు ఏవో రాజ్‌కుమార్ శనివారం తెలిపారు. పంట నష్టం అంచనా వేసి జిల్లా వ్యవసాయ అధికారికి నివేదిక పంపించినట్లు తెలిపారు.

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వీర్‌సింగ్ మాట్లాడుతు ఈదురుగాలులతో కురిసిన వర్షానికి నేలవారిన పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వడగండ్లు, అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పన్నాల తిరుపతి రెడ్డి అన్నారు. శుక్రవారం అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను శనివారం పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

బుగ్గారం: మండలంలోని మద్దునూర్,సిరికొండ,బుగ్గారం గ్రామాల్లో శనివారం కొనుగోలు కేంద్రాలను డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి స్థానిక అధికారులతో కలిసి ప్రారంభించారు.

రాయికల్: రాయికల్ సహకార సంఘం పరిధిలో మైతాపూర్, ఐకేపీ ఆధ్వర్యంలో తాట్లవాయిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మల్లాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత, ప్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సహకారశాఖ అధికారి శ్రీనివాస్, ఏఈవో వంశీ, ప్యాక్స్ సీఈవో రవితేజ, సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని కోమన్‌పల్లి, చిన్న కొల్వాయి, తాళ్ల ధర్మారం, కమ్మునూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు ప్రారంభించారు.

పెగడపల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, విండో చైర్మెన్లు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్ రైతులను కోరారు. మండలంలోని నందగిరి, నామపూర్, బతికపల్లి, మద్దులపల్లి, పెగడపల్లి, అయితిపల్లి, రామభద్రునిపల్లి, ల్యాగలమర్రి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అధికారులతో కలిసి ప్రారంభించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా :
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
జగిత్యాల : సంపత్ - 9676406002
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899